క్లుప్తంగా

ఫాగింగ్ చేయాలి

మహబూబాబాద్: డెంగీ పాజిటివ్ కేసులు ఎక్కువగా ఉన్న ప్రాంతాలలో ఫాగింగ్ చేయాలని సబ్ యూనిట్ ఆఫీసర్ వడ్డెబోయిన శ్రీనివాస్ కోరారు. స్థానిక మున్సిపాలిటీ కార్యాలయంలో శనివారం వైద్యసిబ్బంది కమిషనర్ టి.రాజేశ్వర్‌ను కలిసి డెంగీ కేసులపై చర్చించారు. కార్యక్రమంలో డాక్టర్ నర్మద, హెల్త్ ఎడ్యుకేటర్ పురుషోత్తం, హెచ్ఈఓ తోట శ్రీనివాస్ పాల్గొన్నారు.

కేసీఆర్‌ను కలిసిన మాజీ ఎంపీ కవిత



మహబూబాబాద్: మాజీ సీఎం కేసీఆర్‌ను హైదరాబాద్‌లోని నందినగర్‌లో మానుకోట మాజీ ఎంపీ మాలోత్ కవిత మర్యాద పూర్వకంగా కలిశారు. కేసీఆర్ యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. కేసీఆర్ సతీమణి శోభ ఆశీర్వాదం తీసుకున్నారు.

కంది, మినుముల మినీకిట్ల పంపిణీ

మహబూబాబాద్ రూరల్: జాతీయ ఆహార భద్రత పథకం 2025–26లో భాగంగా కంది, మినుముల మినీకిట్లను ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ శనివారం పంపిణీ చేశారు. మండలంలోని సోమ్లతండా గ్రామంలో జరిగిన పంపిణీ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రైతులు అపరాల పంటలు కూడా సాగు చేయాలని, వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు పాటించి అధిక దిగుబడులు సాధించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి (ఇన్‌చార్జ్) అజ్మీరా శ్రీనివాసరావు, జిల్లా ఉద్యాన అధికారి జి.మరియన్న, తహసీల్దార్ చంద్రరాజేశ్వరరావు, మండల వ్యవసాయ అధికారి నారెడ్డి తిరుపతిరెడ్డి, జంగిలికొండ పాల్గొన్నారు.

సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి

నెహ్రూసెంటర్: సంఘటిత, అసంఘటిత రంగాల్లో పనిచేస్తున్న కార్మికులకు సమానపనికి సమాన వేతనం ఇవ్వాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు పర్వత కోటేష్ డిమాండ్ చేశాడు. ఈనెల 9న జరగనున్న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని శనివారం ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సురేష్, లింగన్న, కృష్ణ, రామ్మూర్తి, ఉప్పలయ్య, జయశంకర్ పాల్గొన్నారు. కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా కోశాధికారి సమ్మెట రాజమౌళి డిమాండ్ చేశాడు. సమ్మె ప్రాధాన్యతను వివరిస్తూ శనివారం కరపత్రాలను పంపిణీ చేశారు.

అరక పట్టిన అధికారులు



మహబూబాబాద్ రూరల్: రైతులు వానకాలం పంటల సాగు పనుల్లో నిమగ్నమై ఉన్న సందర్భంగా వివిధ విభాగాల జిల్లాస్థాయి అధికారులు పంటల సాగులో అవలంబించాల్సిన పద్ధతులపై అవగాహన కల్పిస్తున్న విషయం తెలిసిందే. శనివారం జిల్లా వ్యవసాయ, ఉద్యాన పట్టు పరిశ్రమల శాఖల అధికారులు శ్రీనివాసరావు, మరియన్న, మండల వ్యవసాయ అధికారి తిరుపతిరెడ్డి రైతులను కలిసి ముచ్చటించిన అనంతరం కొంతసేపు అరక బట్టి పొలం పనుల్లో పాల్గొన్నారు. మహబూబాబాద్ మండలంలోని సోమ్లతండా, మల్యాల గ్రామాల్లో అధికారులు అరకపట్టి దున్నుతుండగా రైతులు ఆసక్తిగా తిలకించారు.

మూగజీవాల మృత్యుఘోష

- భద్రత లేని త్రీఫేస్ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, వేలాడుతున్న తీగలు
- పట్టించుకోని విద్యుత్ శాఖ అధికారులు



చిన్నముప్పారంలో మృతిచెందిన గేదెలు (ఫైల్)

నెల్లికుదురు: విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యంలో మండలంలోని వివిధ గ్రామాల్లో త్రీఫేస్ ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ప్రతిఏటా వందల సంఖ్యలో మూగ జీవాలు మృత్యువాత పడుతున్నాయి. మండలంలోని మునిలగలవీడు, నర్సింహులగూడెం, ఆలేరు, ఎర్రబెల్లిగూడెం, నెల్లికుదురు, ఇనుగుర్తి మండలంలోని చిన్ననాగారం, చిన్నముప్పారం గ్రామాల పరిధిలో రైతుల వ్యవసాయ పంటల సాగుకోసం త్రీఫేస్ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశారు. రైతులకు ఎలాంటి విద్యుత్ అంతరాయం ఏర్పడకుండా గ్రామాలు, గిరిజన తండాల్లో వ్యవసాయ మోటార్లను బట్టి 25కేవీ, 63కేవీ, 100కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను వందల సంఖ్యలో ఉన్నాయి. వాటిని రైతులకు తాకే విధంగా చాలా కిందికి ఏర్పాటు చేశారు. దీంతో పాడి గేదెలు, కాడెద్దులు మేత కోసం మేసుకుంటూ వెళ్లి మృత్యువాత పడుతున్నాయి. ఏ ఒక్క గ్రామంలో కూడా ట్రాన్స్‌ఫార్మర్లకు కంచె ఏర్పాటు చేయలేదు. దీనికి తోడు ఎక్కడపడితే అక్కడ విద్యుత్ తీగలు వేలాడుతున్నా విద్యుత్ అధికారులకు పట్టింపు లేదు.

కంచెలు ఏర్పాటు చేయాలి



ప్రభుత్వం మండలంలోని వివిధ గ్రామాలల్లో ఏర్పాటు చేసిన విద్యుత్ త్రీఫేస్ ట్రాన్స్‌ఫార్మర్లకు కంచెలు ఏర్పాటు చేయాలి. వెలాడుతున్న తీగలను సరిచేసి పాడి గేదెలు, కాడెద్దులు మృత్యువాత పడకుండా రైతులను కాపాడాలి. ప్రభుత్వం నిర్లక్ష్యం వీడి విద్యుత్ సమస్యలను పరిష్కరించాలి.

– అలకుంట్ల సాయన్న, నాయకుడు

ఘనంగా పూరీ జగన్నాథుడి రథయాత్ర



రథయాత్ర నిర్వహిస్తున్న భక్తులు

గార్ల: గార్ల పట్టణంలో ఇస్కాన్ సంస్థ ప్రోత్సాహంతో శనివారం పూరీ జగన్నాథుడి రథయాత్రను పుర వీధుల్లో భక్తులు ఘనంగా నిర్వహించారు. ప్రత్యేకంగా ప్రతిష్ఠించిన రథంపై ఒడిషా రాష్ట్రం పూరీ నుంచి వచ్చిన ఉత్సవ విగ్రహాలను భక్తుల కోలాటం, నృత్యాలతో రథయాత్ర శోభాయమానంగా కొనసాగింది. దాత పీఏసీఎస్ చైర్మన్ వడ్లమూడి దుర్గాప్రసాద్ భక్తులకు అన్న ప్రసాదాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఇస్కాన్ సంస్థ గురువులు, భక్తులు బేతి సత్యనారాయణ, శీలంశెట్టి రాంభద్రయ్య, కమల్ అగర్వాల్, కట్ట రమేష్, ఉపేందర్‌రెడ్డి, విజయలక్ష్మి, పి.వేణుగోపాల్, ఒబిలిశెట్టి కృష్ణ పాల్గొన్నారు.

బహిరంగసభను విజయవంతం చేయాలి

- ఎమ్మెల్యే మురళీనాయక్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మురళీనాయక్

కేసముద్రం: కేసముద్రంలో ఈనెల 8న జరగనున్న బహిరంగసభను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే మురళీనాయక్ అన్నారు. శనివారం మున్సిపాలిటీ కేంద్రంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేసముద్రంలో చేపట్టే పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసేందుకు ఈనెల 8న ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వస్తున్నారన్నారు. అనంతరం బహిరంగ సభ ప్రాంగణాన్ని, హెలీప్యాడ్ స్థలాన్ని ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో కేసముద్రం మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి, రాష్ట్ర సంవిధాన్ కమిటీ సభ్యులు వెన్నం శ్రీకాంత్‌రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు అంబటి మహేందర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు అల్లం నాగేశ్వర్‌రావు, మురళీ, వెంకన్న, శ్రీనివాస్‌రెడ్డి, నాగరాజు పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్‌లు రాక చదువులకు దూరం



ధర్నా చేస్తున్న విద్యార్థులు

మహబూబాబాద్ అర్బన్/కురవి: రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు గంధసిరి జ్యోతిబసు డిమాండ్ చేశాడు. జిల్లా కేంద్రంలోని ప్రొఫెసర్ జయశంకర్ జంక్షన్‌లో శనివారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులతో ధర్నా చేశారు. ఈసందర్భంగా జ్యోతిబసు మాట్లాడుతూ.. మూడు సంవత్సరాల నుంచి స్కాలర్‌షిప్‌లు విడుదల కాకపోవడంతో పేద, మధ్య తరగతి విద్యార్థులు ఉన్నత చదువులకు దూరమవుతున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు విద్యార్థులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి నిక్షిప్త, పట్టణ కార్యదర్శి గుండ్ల రాకేష్, వంశీ, మహేష్, సందీప్, అఖిల, మహేశ్వరి పాల్గొన్నారు.

కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలి



నెహ్రూసెంటర్: బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

నెహ్రూసెంటర్: ఈనెల 9వ తేదీన జరగనున్న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఏఐకేఎంఎస్ ఆధ్వర్యంలో శనివారం జిల్లా కేంద్రంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా సంఘం రాష్ట్ర కోశాధికారి నందగిరి వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శి గుజ్జు దేవేందర్ మాట్లాడుతూ.. కార్మిక వ్యతిరేక విధానాలను ప్రభుత్వాలు వీడాలని, కార్మికులకు కనీస వేతనం, ఉద్యోగ భద్రత, ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేసే వరకు కార్మికులు ఐక్యంగా పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బండారు ఐలయ్య, బానోత్ నరసింహ, రామచంద్రు, తోకల వెంకన్న, సక్రు, వెంకటాద్రి, భిక్షం, రవి, వెంకన్న, బాబు పాల్గొన్నారు.

గార్ల: జూలై 9 నిర్వహించే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీపీఎం పార్టీ జిల్లా నాయకుడు కందునూరి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. ఈమేరకు శనివారం గార్లలో హమాలీ వర్కర్స్‌తో కలిసి సమ్మె జయప్రదం చేయాలని కోరుతూ ప్రదర్శనలో నినాదాలు చేశారు.

కార్మిక వర్గానికి ఉరితాళ్లు

మరిపెడ: నూతన లేబర్ కోడ్‌లు కార్మిక వర్గానికి ఉరితాళ్లుగా మారాయని ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి రవి అన్నారు. ఈనెల 9న దేశవ్యాప్త కార్మిక సమ్మె పోస్టర్‌ను శనివారం ఆవిష్కరించారు.

బాతులకోసం వెళ్తే ప్రాణం పోయింది..

బావిలో పడి వృద్ధుడి మృతి

గూడూరు: తాను పెంచుకుంటున్న బాతులు బావిలో పడడంతో తీసేందుకు తాడు సాయంతో దిగుతుండగా ప్రమాదవశాత్తు బావిలో పడి ఓ వృద్ధుడు మృతి చెందాడు.. మండలంలోని అయోధ్యపురం శివారు రాంపురంలో శనివారం ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. రాంపురానికి చెందిన జోగ కట్టయ్య (65) తన బాతులు ఇంటి సమీపంలోని బావిలో పడ్డట్లు గుర్తించాడు. వాటిని బయటికి తీయాలనే ఆలోచనతో ఓ తాడు సాయంతో బావిలోకి దిగుతుండగా ప్రమాదవశాత్తు తాడు జారడంతో బావిలో పడి మృతిచెందాడు. కట్టయ్య భార్య రామక్క ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై గిరిధర్‌రెడ్డి తెలిపారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

నెల్లికుదురు: కారు, మోటార్ సైకిల్ ఎదురుగా ఢీకొన్న ఘటనలో గాయపడి చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన మండలంలోని నర్సింహులగూడెం గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. ఎస్సై చిర్ర రమేష్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన అంబటి మహేష్ (39) డీటీహెచ్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్నాడు. తొర్రూరు నుంచి మోటార్ సైకిల్‌పై నర్సింహులగూడెం గ్రామానికి వస్తున్న క్రమంలో కారు మోటార్ సైకిల్‌ను ఢీకొట్టినట్లు తెలిపారు. ఈ ఘటనలో మహేష్‌కు తీవ్ర గాయాలు కాగా చికిత్స నిమిత్తం ఖమ్మం తీసుకెళ్లగా, పరిస్థితి విషమంగా ఉందని హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స అందిస్తుండగా మృతిచెందినట్లు తెలిపారు. మృతుడి సోదరుడు అంబటి ఉమేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రైలు పట్టాల పక్కన మృతదేహం

డోర్నకల్: డోర్నకల్, పాపటపల్లి రైలు మార్గంలో రైలు పట్టాల పక్కన మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. పాపటపల్లి బుగ్గవాగు సమీపంలో కిలోమీటర్ నంబర్ 468/22–24 వద్ద డౌన్‌లైన్ పట్టాల ప్రక్కన మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందడంతో జీఆర్పీ, ఆర్పీఎఫ్ ఘటనాస్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. మృతుడి వద్ద లభ్యమైన ఆధార్ కార్డు ప్రకారం మృతుడు బిహార్ రాష్ట్రంలోని గయా బారాచెట్టి ప్రాంతానికి చెందిన వాడిగా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఖమ్మం చెందిన అన్నం ఫౌండేషన్ వ్యవస్థాపకులు అన్నం శ్రీనివాస్ తమ సిబ్బందితో ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని ఖమ్మం ఏరియా ఆసుపత్రి మార్చురీకి తరలించారు.

జాగ్రత్తలు పాటించాలి

మరిపెడ రూరల్: చిన్న పిల్లలపై పలు జాగ్రత్తలు పాటించాలని పీహెచ్‌సీ హెల్త్ సూపర్‌వైజర్ సుదర్శన్ సూచించారు. శనివారం మండలంలోని గిరిపురం గ్రామ పంచాయతీ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రంలో హెల్త్ క్యాంప్ నిర్వహించారు.

ట్రిపుల్ ఐటీకి విద్యార్థుల ఎంపిక



మహబూబాబాద్ అర్బన్: విజయకేతనం చూపిస్తున్న విద్యార్థులు

మహబూబాబాద్ అర్బన్: ఆదిలాబాద్ బాసర ట్రిపుల్ ఐటీకి మానుకోట మున్సిపల్ పరిధిలోని అనంతారం మోడల్‌స్కూల్‌కు చెందిన 11 మంది విద్యార్థులు ఎంపికయ్యారని ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ ఉపేందర్‌రావు అన్నారు. విద్యార్థులు అక్షయ్, కావ్య, సానియా, దేవేందర్, షమిత, నిహారిక, వేణు, హేమంత్, కార్తీక్, మల్లిక, ఉజ్మ, గణేష్ ఎంపికయ్యారు.

గూడూరు: మండలంలోని పొనుగోడు, అయోధ్యపురం, తీగలవేణి జెడ్పీహెచ్ఎస్‌లకు చెందిన విద్యార్థులు శివాణి, పావణి, సావిత్రి, ఎస్కే.మదియ, వై.వసంతసాయి, శ్రావ్యలతోపాటు అయోధ్యపురం హైస్కూల్‌కు చెందిన డి.అనిల్, తీగలవేణి హైస్కూల్‌కు చెందిన బి.పరమేశ్వరి ఎంపికయ్యారు.

కేసముద్రం: కల్వల మోడల్ స్కూల్‌కి చెందిన కొణతం మనస్విని, స్వాతి, ధరణి, మహేష్, సాత్విక్, కల్వల జెడ్పీ హైస్కూల్‌కి చెందిన తేజస్విని, వెన్నెల, శివాణీ, పెనుగొండ జెడ్పీ హైస్కూల్‌కి చెందిన స్నేహ, చాంద్‌సలాం, కేసముద్రంస్టేషన్ జెడ్పీ హైస్కూల్‌కి చెందిన రాపోలు సంతు, కేసముద్రంవిలేజ్ జెడ్పీ హైస్కూల్‌కి చెందిన గుండెల యశ్వంత్‌లు సీట్లు సాధించారు.

దంతాలపల్లి: మండల కేంద్రంలోని జిల్లా ప్రజా పరిషత్ సెకండరీ పాఠశాల విద్యార్థినులు వర్షిత, జ్యోత్స్న, తేజాశ్రీ, బి.స్వాతిక ఎంపికయ్యారు.

గార్ల: మండలం లోని పెద్దకిష్టాపురం జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థిని భూక్యా ఇందిర బాసర లోని ట్రిపుల్ ఐటీ కళాశాలలో సీటు సాధించింది.

కురవి: మండలం చింతపల్లి జెడ్పీ హైస్కూల్‌కు చెందిన వి.మహేశ్వరీ, జి.పూజ, కురవి మండలం గుండ్రాతిమడుగు(విలేజ) హైస్కూల్ విద్యార్థి తంగెళ్లపల్లి రాజేశ్‌లకు బాసరలోని ట్రిపుల్ ఐటీలో సీట్లు వచ్చినట్లు హెచ్ఎంలు తెలిపారు. అలాగే గుండ్రాతిమడుగు హైస్కూల్ విద్యార్థి మూడు దేవేందర్‌కు, రాజోలు హైస్కూల్‌కు చెందిన ఎస్‌కే సమీర్‌కు బాసర ట్రిపుల్ ఐటీలో సీటు వచ్చినట్లు తెలిపారు.

మరిపెడ రూరల్: మరిపెడ మండలం జెడ్పీహెచ్ఎస్ ఎల్లంపేట పాఠశాల విద్యార్థులు బాసర ట్రిబుల్ ఐటీకి బి. మౌనిక, భానుప్రియ, అనూష, సాయి చరణ్, జె.వశీకర్ ఎంపికయ్యారు.

చిన్నగూడూరు: మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థులు తొట్ల లక్ష్మణ్, జాటోత్ శైలజ, పచ్చిపాల సంధ్య, దుండిగాల కావేరి, షేక్ మహిమూదా, అక్కినపల్లి నిహారిక, చెవుల ఉదయ్ ఎంపికయ్యారు.

పెద్దవంగర: మండలంలోని పెద్దవంగర, చిట్యాల, అవుతాపురం, బొమ్మకల్లు ప్రభుత్వ ఉన్నత పాఠశాలల విద్యార్థులు మేఘన, శ్రీవల్లి, అప్సర్, కీర్తన, అజయ్, చిట్యాల పాఠశాల నుంచి అభిషేక్, భవాని, మహేష్, స్వాతి, యజ్ఞ, అవుతాపురం పాఠశాల నుండి శివతేజ, స్పందన, బొమ్మకల్లు నుంచి నితిన్‌లు బాసర ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు.

టీబీ రహిత సమాజమే ధ్యేయం



దంతాలపల్లి: మాట్లాడుతున్న వైద్యురాలు రమ్య

దంతాలపల్లి: టీబీ రహిత సమాజమే ప్రభుత్వ ధ్యేయం అని తహసీల్దార్ సునీల్‌కుమార్, ఎంపీడీఓ వివేక్‌రామ్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రజావైద్యశాలలో శనివారం వైద్యురాలు రమ్య ఆధ్వర్యంలో టీబీ నివారణపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. టీబీ వ్యాధిని నిర్మూలించడానికి ప్రభుత్వం అన్నివిధాలుగా చర్యలు తీసుకుంటుందన్నారు. అలాగే వ్యాధిగ్రస్తులకు ఆహారం అందించే దాతలు ముందుకు రావాలని కోరారు.

బయ్యారం: వంద రోజుల్లో టీబీ నిర్మూలనపై తీసుకోవాల్సిన చర్యలపై శనివారం ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంను ఉద్దేశించి తహసీల్దార్ నాగరాజు, ఎంపీడీఓ విజయలక్ష్మి మాట్లాడారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నెహ్రూసెంటర్: జిల్లా కేంద్రంలోని పాతబజారులో నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్‌శాఖ ఏఈ సంగీత శనివారం తెలిపారు. 11 కేవీ ఫీడర్ మరమ్మతుల కారణంగా ఉదయం 7గంటల నుంచి 9గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. నందినగర్, గుండ్లకుంట, స్తూపంకాలనీ, ఎల్‌బీజీనగర్, రాహుల్‌నగర్, కంకరమిల్, చిట్యాల గోపయ్యనగర్, అంబేడ్కర్ కాలనీ, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏరియా, ఆర్టీసీ బస్టాండ్ ఏరియా, రాంచంద్రాపురం కాలనీ, స్నేహనగర్, ఈదులపూసలపల్లి, ఆకుల లక్ష్మయ్య కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

గడ్డి మందు కొట్టడంతో చనిపోయిన వరినారు

నెల్లికుదురు: గడ్డి మందు కొట్టడంతో వరి నారు చనిపోయింది. ఈ సంఘటన మండలంలోని ఎర్రబెల్లిగూడెం గ్రామంలో చోటుచేసుకుంది. శనివారం బాధితుడు గుండెబోయిన యాకయ్య తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన యాకయ్య తన అన్నదమ్ముల మధ్య గతనెల నుంచి భూ తగాదాలు జరుగుతున్నట్లు చెప్పాడు. పాత కక్షలు మనసులో పెట్టుకుని తన సోదరుడు గుండెబోయిన అశోక్, తన భార్య మంజు ఇద్దరు కలిసి నారుమడిలో గడ్డి మందు కొట్టి నారు మడి మొత్తం చనిపోవడానికి కారమైనట్లు ఆయన ఆరోపించారు. న్యాయం చేయాలని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు యాకయ్య తెలిపాడు.

సమస్యలు పరిష్కరించాలి

నర్సింహులపేట: హాస్టళ్లల్లో చదువుతున్న విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం పెట్టాలని, హాస్టల్‌లోని సమస్యలను పరిష్కరించాలని పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు బానోతు నందీశ్వర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని హాస్టళ్లను పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో తనిఖీ చేశారు.

పథకాలు ప్రతీ ఒక్కరికి చేరాలి

మరిపెడ రూరల్: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి చేరువకావాలని మండలంలోని బీచ్‌రాజుపల్లి కార్యదర్శి దొంతు లేనిన్ అన్నారు. శనివారం బీచ్‌రాజుపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని జర్పుల తండాలో 'జన జాతీయ గౌరవ్ వర్ష్' వేడుకలను నిర్వహించారు

గుడుంబా తయారీదారుడి రిమాండ్

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని సీరోల్ మండలం గుజిలితండాకు చెందిన జాటోత్ రవి గుడుంబా తయారు చేస్తూ పట్టుబడగా అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చగా అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు జడ్జి ఏ.కృష్ణతేజ్ అతడికి 14రోజుల రిమాండ్ విధించారని ఎక్సైజ్ సీఐ జి.చిరంజీవి శనివారం తెలిపారు.

ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలి

పెద్దవంగర: స్థానిక సంస్థల ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఈదురు ఐలయ్య కోరారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో శనివారం మండలంలోని పోచంపల్లి, పడమటి తండా, జైరాం తండా, రాజమాన్‌సింగ్ తండాల్లో సన్నాహక సమావేశాలు నిర్వహించారు. ఈ సమావేశంలో నాయకులు శ్రీరాం సంజయ్, వెంకన్న, సుధీర్ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

డ్రెయినేజీ నిర్మాణ పనులు ప్రారంభం

గూడూరు: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో శనివారం ఎస్సీ సబ్ ప్లాన్ నిధులు రూ.15లక్షలతో సైడ్ డ్రెయినేజీ నిర్మాణ పనులకు శనివారం జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి వాంకుడోతు కొమ్మాలునాయక్, మండల కాంగ్రెస్ వర్కింగ్ ప్రసిడెంట్ బీరం శ్రీపాల్‌రెడ్డి ప్రారంభించారు. నాయకులు స్వామి, యాకయ్య, రసూల్, శ్రీను పాల్గొన్నారు.

ఆర్థికసాయం



కేసముద్రం: మండలంలోని వెంకటగిరి గ్రామానికి చెందిన గాండ్ల అశోక్, అతడి భార్య అనారోగ్యంతో కొన్ని సంవత్సరాల క్రితం మృతి చెందారు. దీంతో ఒంటరైన బాల్యమిత్రుడి కూతురు శివానీని చదివించేందుకు మున్సిపాలిటీ పరిధి ఎస్‌వీవీకి చెందిన 1996–97 పూర్వ విద్యార్థులు శివాని చదువు కోసం రూ.40వేలను శనివారం పాఠశాల యాజమాన్యానికి అందజేశారు. కార్యక్రమంలో వోమ సంతోష్, జలగం అనిల్, సోమనర్సయ్య పాల్గొన్నారు.

మరమ్మతులు

బయ్యారం: మండలంలోని జగ్గుతండా పంచాయతీ పరిధిలో తాగునీటి పైపులైన్ లీకేజీపై 'సాక్షి' లో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. పగిలిన పైపులైన్‌కు మరమ్మతులు నిర్వహించి నీరు లీకేజీ కాకుండా చర్యలు తీసుకున్నారు.

నల్లబెల్లం పట్టివేత

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని ఈదులపూసపల్లి గ్రామ ప్రధాన రహదారిపై వాహనాల తనిఖీలో మూడు క్వింటాళ్ల నల్లబెల్లం, 50కిలోల పటిక, ఐదు లీటర్ల గుడుంబా పట్టుబడినట్లు రూరల్ ఎస్సై వి.దీపిక శనివారం తెలిపారు. నిజ్జు, చంటి, భూక్య చందులాల్ ముగ్గురు కలిసి నల్లబెల్లం వ్యాపారం చేస్తున్నట్లు గుర్తించామన్నారు. చంటి, నిజ్జు పరారయ్యారని తెలిపారు. కేసు నమోదు చేసే విచారణ చేస్తున్నామని ఎస్సై పేర్కొన్నారు.

ఘనంగా నిర్వహించాలి

నెహ్రూసెంటర్/నెల్లికుదురు: ఈనెల 7వ తేదీన ఎమ్మార్పీఎస్ 31వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని సంఘం జిల్లా ఇన్‌చార్జ్ కోళ్ల శివ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలో సంఘ సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు శాగంటి రమేష్ , ఇసినపల్లి అశోక్, శేషం కిరణ్ పాల్గొన్నారు.

ఏకలవ్య స్కూల్‌ను సందర్శించిన తహసీల్దార్

కురవి: సీరోలు మండల కేంద్రంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్‌ను శనివారం సీరోలు తహసీల్దార్ పున్నంచందర్ సందర్శించారు. డైనింగ్ హాల్‌ను, వంట గదులను పరిశీలించారు. పిల్లలతో కలసి భోజనం చేశారు.

ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన

గార్ల: మార్కెట్ డిమాండ్ ఉన్న పంటలను సాగు చేసుకొని రైతులు అధిక ఆదాయం పొందవచ్చని మండల వ్యవసాయ, ఉద్యానవన శాఖల అధికారులు కావటి రామారావు, శాంతిప్రియ సూచించారు. శనివారం మండలంలోని బుద్దారం గ్రామంలో రైతు రావూరి వెంకట్రామయ్య సాగు చేసిన ఆయిల్‌పామ్ తోటలో వారు క్షేత్ర ప్రదర్శన చేసి రైతులకు అవగాహన కల్పించారు.

ఎరువులషాపుల తనిఖీ

బయ్యారం: మండలంలోని రామచంద్రాపురం, మిర్యాలపెంట, సాంబతండాలోని పలు విత్తనాలు, ఎరువుల షాపుల్లో మండల వ్యవసాయాధికారి రాంజీ శనివారం తనిఖీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఏఈఓ తేజస్విని పాల్గొన్నారు.

విద్యార్థి అదృశ్యం.. కేసు నమోదు



మహబూబాబాద్ రూరల్: విద్యార్థి అదృశ్యంపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నామని మహబూబాద్ టౌన్ సీఐ గట్ల మహేందర్ రెడ్డి శనివారం తెలిపారు. జిల్లా కేంద్రంలోని వేల్పుల సత్యం నగర్ కాలనీలో గల దైవకృప అనాథ ఆశ్రమంలో ఉంటున్న విద్యార్థి పస్తం సాయి ఈనెల 4వ తేదీన స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలకు వెళ్తున్నానని చెప్పి అక్కడి నుంచి బయటకు వచ్చాడు. దీంతో దైవకృప అనాథాశ్రమం నిర్వాహకులు బానోతు లోకేష్ విద్యార్థి మేనమామకు సమాచారం ఇచ్చి విద్యార్థి అదృశ్యంపై పోలీస్‌స్టేషన్ ఫిర్యాదు చేయగా టౌన్ ఎస్సై కె.శివ కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారని తెలిపారు.

టీపీఎస్ఎఫ్ జిల్లా కమిటీ ఎన్నిక

మహబూబాబాద్: జిల్లా కేంద్రంలో శనివారం టీపీఎస్ఎఫ్ జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కుమార్, జనరల్ సెక్రెటరీగా రాము, అసోసియేట్ ప్రెసిడెంట్లుగా లెనిన్, కార్తిక్, వైస్ ప్రెసిడెంట్‌లుగా సుమంత్, మోతీలాల్ ఎన్నుకున్నారు. మానుకోట డివిజన్ అధ్యక్షుడిగా సుందర్, తొర్రూరు డివిజన్ అధ్యక్షుడిగా రాజశ్వేర్‌ను ఎన్నుకున్నట్లు జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్ తెలిపారు.